సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం । 3 । జూలై । 2023



ఆలోచింపచేసిన నాటికలు

అల్లూరి సీతారామరాజు స్మారక ఆహ్వాన నాటిక పోటీల్లో రెండో రోజు ప్రదర్శనలు ఆలోచింప జేశాయి. వెండి అంచులు, నిశ్శబ్దమా నీ ఖరీదెంత?, కావాలా నాటికలు ప్రదర్శించారు. 8లో



సేవా వలంటీర్లు

గ్రామ, వార్డు వలంటీర్లు అంకితభావంతో సేవలందిస్తున్నారు. దూర ప్రాంతాల్లో లబ్ధిదారుల వద్దకు వెళ్లి మరీ వైఎస్సార్ పెన్షన్ కానుకను అందించి నిబద్ధత చాటారు. 8లో



బాస్కెట్‌బాల్ విజేత 'పశ్చిమ'

8వ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ బాస్కెట్ బాల్ బాలికల పోటీల్లో విజేతగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జట్టు నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో తూర్పు గోదావరి జట్టుపై పై చేయి సాధించింది. 8లో

అన్నదాతపై అబీమానం

పంటల బీమా.. రైతుకు ధీమా

- విపత్తుల సమయంలో ప్రభుత్వ సాయం
- ఏటా పంట నష్టపరిహారం చెల్లింపు
- ఉచిత పంటల బీమా అమలు
- ఏ సీజన్‌లో పరిహారం ఆ సీజన్‌లోనే అందజేత



ఏలూరు (మెట్రో): రాష్ట్రంలో అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగనన్న సర్కారు విత్తు నుంచి పంట విక్రయాల వరకూ అన్నింటా అండగా నిలుస్తోంది. అలాగే గతంలో ఎన్నడూ లేనివిధంగా రైతులకు పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించడంతో పాటు వైఎస్సార్ ఉచిత పంటల బీమాను వర్తింపజేస్తోంది.

ఫ్యాక్ట్ చెక్

ఎప్పటికప్పుడు పంట నష్టాలను అంచనా వేస్తూ.. ఏ సీజన్లో జరిగిన పంట నష్టానికి అదే సీజన్‌లో రైతులకు పరిహారాన్ని అందిస్తోంది. అయితే ఇవేమీ పట్టించుకోని పచ్చమీడియా పంట నష్టపరిహారం, పంటల బీమాను ఒకే గాటన కట్టి రైతులకు ప్రభుత్వం మొండిచేయి చూపిస్తుందంటూ తప్పుడు ప్రచారం చేస్తోంది. వాస్తవానికి పంట నష్టపరిహారం, పంటల బీమా రెండింటీ ద్వారా ప్రభుత్వం రైతులను ఆదుకుంటోంది.

పంట నష్టపరిహారం అంటే..

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూలేని విధంగా ప్రభుత్వం పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ)ని అందిస్తోంది. ప్రకృతి విపత్తుల ద్వారా పంట నష్టం జరిగిన వెంటనే అధికారులు పొలంబాట పట్టి 24 గంటల్లో నష్టం అంచనాలను రూపొందిస్తున్నారు. దీనిపై పూర్తిస్థాయి జాబితాను ప్రభుత్వానికి నివేదించి రైతులకు నష్టం లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నివేదికలు ఆధారంగా ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకుంటోంది. ఏ సీజన్‌లో పంట నష్టపోతే అదే సీజన్‌లో రైతులకు పరిహారం అందించేలా చూస్తోంది.

ఉచిత పంటల బీమా

2019లో వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కేవలం రూపాయి చెల్లిస్తే పంటల బీమా వర్తించేలా మొదట్లో పథకాన్ని అమలుచేసింది. అనంతరం ఆ రూపాయి కూడా తొలగించి ఈ–క్రాప్ నమోదు ద్వారా ప్రభుత్వమే ప్రతి పంటకూ ఉచిత బీమా వర్తింపజేస్తోంది. పంటల బీమాను గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని, గత ఏడేళ్ల పంట దిగుబడులను సరాసరి చేసి పంట కోత ప్రయోగాల ఆధారంగా వచ్చిన దిగుబడులకు అనుకూలంగా వర్తింపజేస్తున్నారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులకు ఆశించిన మేర దిగుబడులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో దిగుబడులు రాని రైతులకు మాత్రమే ఉచిత బీమా వర్తిస్తుందన్న మాట. ఇలా పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో, దిగుబడులు కోల్పోయిన రైతులను ఉచిత పంటల బీమా ద్వారా ప్రభుత్వం ఆదుకుంటోంది.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా

పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ)

సంవత్సరం	రైతుల సంఖ్య	బీమా పరిహారం (రూ.లక్షల్లో..)
2019–20	639	54.00
2020–21	65,146	471.60
2021–22	21,975	195.00
2022–23	170	103.50
2023–24	1,979	116.00

వైఎస్సార్ ఉచిత పంటల బీమా పరిహారం

సంవత్సరం	రైతుల సంఖ్య	పరిహారం (రూ.కోట్లలో)
2021	5,964	10.65
2022	3,161	2.21

నష్టపోయిన రైతులకు అదే సీజన్‌లో పరిహారం

ఏలూరు వ్యవసాయశాఖ జేడీ వై.రామకృష్ణ



పంట కాలంలో అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న రైతులకు అదే సీజన్‌లో పరిహారం అందిస్తున్నామని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ (ఏలూరు) వై.రామకృష్ణ తెలిపారు. పంటల బీమా కింద దిగుబడి ఆధారిత, వాతావరణ ఆధారిత పంట నష్టపరిహారం ఇస్తామన్నారు. దిగుబడి ఆధారిత పంటలకు పంట కోత ప్రయోగాలను ప్రామాణికంగా తీసుకుని, వాస్తవ దిగుబడులని పరిశీలించి బీమా మంజూరు చేస్తామన్నారు. అలాగే వాతావరణ ఆధారిత పంటల బీమాకు వాతావరణంలో ఉన్న హెచ్చుతగ్గులను ప్రామాణికంగా తీసుకొని నష్టపరిహారం లెక్కిస్తారని చెప్పారు. గత ఖరీఫ్ (2022) పంట కాలంలో వాతావరణం అనుకూలించడం వల్ల దిగుబడులు ఆశాజనకంగా నమోదయ్యాయన్నారు. అలాగే దిగుబడి ఆధారిత పంటల బీమాను గ్రామ యూనిట్‌గా, వాతావరణ ఆధారిత బీమాను మండల యూనిట్‌గా తీసుకుంటారని చెప్పారు. దీనిలో భాగంగా ఏలూరు జిల్లా కలిదిండి మండలంలోని రెండు గ్రామాలకు దిగుబడి ఆధారిత బీమా వర్తిస్తుందన్నారు. అలాగే జిల్లాలోని పలు మండలాలకు వాతావరణ ఆధారిత బీమా మంజూరైందన్నారు. బీమా పరిహారం విషయంలో ఎవరి ప్రమేయం ఉండదని, ఎవరైనా అనర్హులకు ఈ–క్రాప్ నమోదు ద్వారా బీమా పరిహారం చెల్లింపులు జరగకుండా సామాజిక తనిఖీ మేరకు అభ్యంతరాలను నమోదు చేయడానికి రైతు భరోసా కేంద్రాల్లో గ్రీవెన్స్ మాడ్యూల్ అందుబాటులోకి తీసుకొచ్చామని ఆయన చెప్పారు. బీమాకు అర్హులైన రైతుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ నిమిత్తం ఈనెల 3వ తేదీ వరకు ప్రదర్శించి అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామని అన్నారు. బీమా పరిహారం చెల్లింపు విషయమై రైతులు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ వివరించారు.

న్యూస్‌రీల్

రాట్నాలమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



ప్రత్యేక పూజలు చేయిస్తున్న హైకోర్టు నాయ్యమూర్తి మధుసూదనరావు దంపతులు

పెదవేగి : మండలంలోని రాట్నాలకుంటలోని రాట్నాలమ్మవారి ఆలయాన్ని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి తల్లాప్రగడ మధుసూదనరావు దంపతులు సందర్శించారు. ముందుగా న్యాయమూర్తి దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. భీమడోలు జూనియర్ సివిల్ జడ్జి రిషిక్ ఆయన వెంట ఉన్నారు.

పోటెత్తిన భక్తులు

అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయానికి ఒక్కరోజు ఆదాయం రూ.75,439 లభించిందని ఈఓ ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు. పూజా టికెట్ల ద్వారా రూ.34,565, విరాళాల రూపంలో రూ.11,417, లడ్డూ విక్రయాల ద్వారా రూ.28,125, ఫొటోల అమ్మకం ద్వారా రూ.1,332, ఆదాయం లభించిందన్నారు. ఆలయ చైర్మన్ చల్లగొళ్ల వెంకటేశ్వరరావు ఆలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శాకంబరి.. శుభంకరి



మొగల్తూరు: ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని కూరగాయలు, పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మరో రెండు రోజులపాటు అలంకరణ ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ కొల్లాటి రామారావు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈఓ డి.రామకృష్ణంరాజు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఎంఈఓ-1 పోస్టులకు కౌన్సెలింగ్ పూర్తి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాఠశాల విద్యాశాఖ జోన్–2 (ఉమ్మడి కృష్ణ, ఉభయగోదావరి జిల్లాల ప్రాతిపదికన) పరిధిలో ఎంఈఓ–1 పోస్టుల భర్తీకి కాకినాడ ఆర్‌జేడీ కార్యాలయంలో ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. దీంతో ప్రభుత్వ యాజమాన్యాల్లో పనిచేస్తున్న గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులు ఎంఈఓ–1గా కొలువుదీరనున్నారు. నిమ్మగడ్డ రవీంద్రభారతి (ఏలూరు) ఉంగుటూరు, మాణిక్యం తిరుమల దాసు (కొవ్వూరు) దేవరపల్లి, ముదావతు సేవ్య (తాడేపల్లిగూడెం) నూజివీడు, అల్లూరి రవిప్రకాష్ (కైకలూరు) ఏలూరు రూరల్, కురిసేటి నాగవెంకట గణేష్ (చింతలపూడి) నిడదవోలు, ఆకెళ్ల వెంకట నాగ వరప్రసాద్ (గోపన్నపాలెం) దెందులూరు, వై.సత్యనారాయణ (వేగేశ్వరపురం) నల్లజర్ల, పెన్మెత్స వెంకట శివ నాగరాజు (అత్తిలి) పాలకోడేరు, డి.మురళీ సత్యనారాయణ (నిడదవోలు) తణుకు, ఎస్.మనోహరం (నరసాపురం) రాజోలు, బీబీఎస్ స్వరూప్ (పోలవరం) పెరవలి, చెక్కా సెక్షణ రాజు (పెంటపాడు) ఉండ్రాజవరం, కేవీవీఎస్ సుబ్రహ్మణ్యం (పెరవలి) కాట్రేనికోన, జీవీఎస్ విజయకుమార్ (ఆచంట) పోడూరు, ఈ.శ్రీనివాసరావు (కొయ్యలగూడెం) భీమడోలు, రామ్ బాల సింగ్ (యండగండి) బాపులపాడు, ఎస్.రమేష్ (మోపిదేవి) అత్తిలి మండల విద్యాశాఖాధికారులు (ఎంఈఓ)గా నియమితులయ్యారు. వీరిని సోమవారం ప్రస్తుత విధుల నుంచి విడుదల చేయాలని సంబంధిత ఉప విద్యాశాఖాధికారులను ఆర్‌జేడీ జి.నాగమణి ఆదేశించారు.

వంతెన పనుల పరిశీలన

లింగపాలెం: లింగపాలెం నుంచి కొత్తపల్లి వెళ్లే రహదారిలోని పేరంటాలు చెరువు అలుగు చానల్‌పై వంతెన నిర్మాణానికి ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ రూ.33 లక్షల నిధులు మంజూరు చేశారు. ఆదివారం వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. వర్షాకాలంలో అలుగు చానల్‌పై వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడేవారని, వంతెన నిర్మాణం పూర్తయితే ఇబ్బందులు తొలగుతాయని ఎంపీ శ్రీధర్ అన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం



అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: గంజాయి, మత్తుపదార్థాలు వంటివి ఆలవాటు చేసుకుంటే జీవితం నాశనం అవుతుందని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. గంజాయి సేవించే అలవాటు ఉన్న వ్యక్తులకు కౌన్సెలింగ్‌లో భాగంగా ఆదివారం పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో యువకులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు కూడా పిల్లలపై నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నామని, గంజాయి రవాణా ప్రాంతాలపై నిఘా పెంచామన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు వినియోగిస్తున్న వారిని గుర్తించి ఈనెల 7 వరకు కౌన్సెలింగ్‌లు నిర్వహిస్తూ, ఆయా మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చి ముందస్తుగా బైండోవర్ చేస్తున్నామని చెప్పారు.

ఈసెట్‌లో 1,992 మంది అర్హత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీ ఈసెట్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. ఏలూరు జిల్లా నుంచి 677 మంది రిజిస్టర్ చేసుకోగా వారిలో 566 మంది బాలురు, 111 మంది బాలికలు ఉన్నారు. పరీక్షలకు 533 మంది బాలురు హాజరుకాగా 499 మంది, 101 మంది బాలికలకు 95 మంది అర్హత సాధించారు. పశ్చిమగోదావరి జిల్లాలో 1,553 మంది రిజిస్టర్ చేసుకోగా వారిలో 1,186 మంది బాలురు, 367 మంది బాలికలు ఉన్నారు. పరీక్షలకు 1,132 మంది బాలురు హాజరుకాగా 1,051 మంది, 359 మంది బాలికలకు 347 మంది అర్హత సాధించారు.

బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను సీఎం నెరవేర్చారు



విలేకరులతో మాట్లాడుతున్న ఏపీ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలోని బ్రాహ్మణులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ దాదాపు నెరవేర్చారని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సత్యవాడ దుర్గాప్రసాద్ చెప్పారు. బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర కోర్ కమిటీ సమావేశం ఆదివారం ఏలూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులను తాము కలిసి బ్రాహ్మణులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే బ్రాహ్మణులకు మూడు సీట్లు కేటాయించగా, రెండింటిలో విజయం సాధించారని చెప్పారు. టీడీపీ, జనసేన బ్రాహ్మణులకు ఒక్క సీటు కూడా కేటాయించలేదని తెలిపారు. రాష్ట్రంలో రూ.5 లక్షల ఆదాయం ఉన్న ఆలయాలు, సత్రాల పరిపాలనా బాధ్యతలను బ్రాహ్మణులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రధాన కార్యదర్శి కె.సతీష్‌శర్మ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా బ్రాహ్మణ కార్పొరేషన్‌కు ఇస్తామని చెప్పిన నిధులను కూడా విడుదల చేయలేదన్నారు. రిజర్వేషన్లలో 10 శాతం బ్రాహ్మణులకు కేటాయించి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారి అభివృద్ధికి సహకరించాలని కోరారు. సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సీఆర్‌కే శేషగిరిరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వివిధ పథకాల రూపంలో ఎక్కువ మంది బ్రాహ్మణులకు లబ్ధి కలుగుతోందన్నారు. మొత్తం 48 వేల మంది బ్రాహ్మణులకు పింఛన్లు, 33 వేల మందికి అమ్మఒడి పథకం సాయం అందుతున్నాయని సంతృప్తి వ్యక్తంచేశారు. సీఎం జగన్ వివిధ వర్గాలకు ఇస్తున్నట్లుగానే పురోహితులకు ప్రతి నెలా రూ.5 వేలు గౌరవ వేతనం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర కోశాధికారి హెచ్‌కే మనోహర రావు, ఉపాధ్యక్షుడు కేవీఎల్‌ఎల్ రామచంద్రమూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పులిపాక ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి తెలికపల్లి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యుడు కోడూరు ఆంజనేయ శర్మ పాల్గొన్నారు.

అమ్మఒడితో అక్షరాస్యత వృద్ధి

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెంలో జగనన్న అమ్మఒడి చెక్కు అందిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: అక్షరాసత్యతో ప్రతి కుటుంబం ఆర్థిక ప్రగతి సాధిస్తుందని, ఇందుకు జగనన్న అమ్మఒడి పథకం దోహదపడుతుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక మాగంటి కల్యాణ మండపంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్ అధ్యక్షతన ఆదివారం పట్టణస్థాయి జగనన్న అమ్మఒడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ సీఎం జగన్ క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులకు పిల్లల చదువు భారం కాకూడదనే ఉద్దేశంతో అమ్మఒడి ద్వారా ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు. అమ్మఒడి సాయం పిల్లల విద్యావసరాలకు ఉపయోగపడుతుందన్నారు. సీఎం జగన్ పాలన చరిత్రలో నిలిచిపోతుందని, చంద్రబాబు హయాంలో ప్రభుత్వ పాఠశాలలను నీరుగార్చారని అన్నారు. సీఎం జగన్ హయాంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులకు పోటీగా ఉన్నారన్నారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఎక్కువ మార్కుల శాతం సాధించారన్నారు. రాష్ట్రంలోని పాఠశాల తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. అనంతరం అమ్మఒడి చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. మంత్రి కొట్టును గజమాలతో విద్యార్థులు సత్కరించారు. ఎంఈఓ హనుమ, కర్రి భాస్కరావు, కన్నాటి కన్నయ్య, కొలుకులూరి ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్, బోణం విజయనిర్మల పాల్గొన్నారు.

పవన్ అబద్ధాలను వారాహి మాత క్షమించదు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాట్లాడే అబద్ధాలను వారాహి మాత క్షమించదని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ తిరుగుతున్న వాహనం ఒక మిలటరీ లారీ అని చెప్పారు. మిలటరీ లారీని లారీ కాకపోతే బస్సు అంటారా అని ప్రశ్నించారు. వారాహి అమ్మవారి పేరుపెట్టుకున్న వాహనం నుంచి పవన్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. అబద్ధాలకోరును వారాహి అమ్మవారు ఆశీర్వదిస్తుందా అని ప్రశ్నించారు. దుర్మార్గుడు, దుష్టుడు, వెన్నుపోటుదారుడైన చంద్రబాబుకు మద్దతు తెలుపుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ఉద్దేశించి పచ్చి అబద్ధాలు మాట్లాడటం పవన్ కళ్యాణ్‌కు సబబుగా లేదన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన 650 హామీలను బుట్టదాఖలు చేసిన తెలుగుదేశం పార్టీ నాయకుడు చంద్రబాబును పవన్ గుడ్డిగా సమర్థిస్తున్నాడన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమంతో ప్రతి కుటుంబం సంతోషంగా ఉందన్నారు. పవన్ మాట్లాడే అబద్ధాలకు వారాహి మాత తగిన శిక్ష విధిస్తుందని మంత్రి కొట్టు సత్యనారాయణ హెచ్చరించారు.

గోదారమ్మకు నీరాజనం



వ్యాస పూర్ణిమ సందర్భంగా సిద్ధాంతంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గోదావరి మాత్రకు పంచ హారతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏకముఖ, ద్విముఖ, చతుర్థ, పంచమ, కుంభ, నక్షత్ర, పూర్ణ కుంభ, సర్ప హారతులను ఇచ్చారు. నదీమతల్లిని ఆరాధించడం హిందూ సంస్కృతిలో భాగమని, ప్రతి పౌర్ణమికి గోదారమ్మకు హారతులు ఇస్తున్నామని ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు చెప్పారు. బొబ్బ రాధాకృష్ణ, సత్యదుర్గాదేవి దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– పెనుగొండ

7 నుంచి బెంగళూరుకు ప్రత్యేక రైలు

నరసాపురం రూరల్: నరసాపురం నుంచి బెంగళూరుకు ఈనెల 7వ తేదీ నుంచి ప్రతి శుక్రవారం ప్రత్యేక రైలు నడవనుందని స్టేషన్ మేనేజర్ దివాకర్ తెలిపారు. రైలు శుక్రవారం సాయంత్రం 3.30 గంటలకు నరసాపురం నుంచి బయలుదేరి శనివారం ఉదయం 9.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుందన్నారు. అలాగే శనివారం ఉదయం 10.50 గంటలకు బెంగళూరు నుంచి బయలుదేరి ఆదివారం ఉదయం 5 గంటలకు నరసాపురం చేరుకుంటుందన్నారు. ఈ రైలు సెప్టెంబర్ 29 వరకు మూడు నెలల పాటు నడుస్తుందన్నారు. నెల్లూరు, రేణిగుంట, కాట్పాడి స్టేషన్‌ల మీదుగా బెంగళూరు చేరుకునే రైలు పశ్చిమ గోదావరి జిల్లాలో పాలకొల్లు, భీమవరం టౌన్, ఆకివీడు స్టేషన్లలో ఆగుతుందని చెప్పారు.

పునరావాస కాలనీల్లో సంక్షేమం కోసం వినతి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసి వచ్చిన నిర్వాసితులకు నిర్మించిన పునరావాస కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని, వారికి సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రాసిన లేఖను ఆదివారం మీడియాకు విడుదల చేశారు. పోలవరం పోరుకేక పాదయాత్ర సందర్భంగా గుర్తించిన 17 అంశాలను ఆయన ఆ లేఖలో ప్రస్తావించారు. నిర్వాసితులకు ఉపాధిహామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని, చిన్నతరహా పరిశ్రమలు నెలకొల్పి వాటిలో స్థానిక ఆదివాసీలకే అన్ని తరహా ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. గుబ్బల మంగమ్మ, మంజులూరు వంటి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. 18 ఏళ్లు నిండిన వారికి చదువుతో సంబంధం లేకుండా నిరుద్యోగ భృతి ఇవ్వాలని, చదువుకున్న యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, చింతూరు, కేఆర్‌పురం ఐటీడీఏలకు ఐఏఎస్ అధికారులను పీఓలుగా నియమించాలని ఆయన కోరారు.

లయన్స్ సేవలు ప్రశంసనీయం



ఆకివీడులో ఉత్తమ విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఆకివీడు: సమాజ శ్రేయస్సుకు లయన్స్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక వి.కన్వెన్షన్ హాలులో ఆదివారం లయన్స్ ఆకివీడు క్లబ్ 51వ ప్రమాణ స్వీకారోత్సవం, చినకాపవరం క్లబ్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రమశిక్షణ, సమర్థవంతమైన నాయకత్వంతో క్లబ్ ప్రతినిధులు ఉత్తమ సేవలు అందిస్తున్నారన్నారు. స్ఫూర్తితో లయన్స్ క్లబ్ ఇచ్చిన కుట్టుమెషీన్ ఈప్రాంతానికి చెందిన వ్యక్తిని కెనరా బ్యాంక్ సీఎండీగా చేయడం గర్వకారణమన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. డీఈఓ వెంకటరమణ మాట్లాడుతూ మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలకు లయన్స్ క్లబ్ ద్వారా ల్యాబొరేటరీ పరికరాలు అందించేందుకు ముందుకు వచ్చారన్నారు. లయన్స్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎం వి.సూర్యనారాయణ రాజు నూతన క్లబ్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. మెరిట్ విద్యార్థులకు రూ.5 వేలు నగదు, ప్రశంసా పత్రాన్ని కలెక్టర్ ప్రశాంతి, డీఈఓ, లయన్స్ ప్రతినిధుల చేతులమీదుగా అందజేశారు. క్లబ్ ప్రతినిధులు చిలువూరి కృష్ణంరాజు, పిన్నమరాజు మురళీకృష్ణంరాజు, వేగేశ్న కృష్ణంరాజు, నేరెళ్ల రామ రోశయ్య, దాసరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుబ్బల మంగమ్మ గుడికి పోటెత్తిన భక్తులు



గుబ్బల మంగమ్మ గుడికి బోనాలు ఎత్తుకుని వెళ్తున్న భక్తులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం కామవరం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొలువై భక్తుల పూజలందుకుంటున్న గుబ్బల మంగమ్మ గుడికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడి ఉంది. తెలంగాణ రాష్ట్రంతో పాటు ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన భక్తులు ఆషాఢ మాస బోనాలతో పాటు సన్నాయి వాయిద్యాలతో అమ్మ వారి సన్నిధికి ఊరేగింపుగా వచ్చి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆదివారం కూడా భక్తులు ఆషాఢమాసం బోనాలు సమర్పించి పూజలు చేశారు. లారీలు, ఆటోలు, బస్సులు, జీప్‌లు, ద్విచక్ర వాహనాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో కమిటీవారు భక్తులకు ట్రాఫిక్ సమస్య, ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు చేపట్టారు.

108లో గర్భిణి ప్రసవం



108లో మగబిడ్డకు జన్మనిచ్చిన మహిళ

మొగల్తూరు: మండలంలోని కాళీపట్నం గ్రామానికి చెందిన కె.లక్ష్మీదుర్గ 108 వాహనంలో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండటంతో ఆసుపత్రికి తరలించారు. ఆశా వర్కర్ కోమలి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లక్ష్మీదుర్గకు పురిటినొప్పులు రావడంతో 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మొగల్తూరు జాతీయ రహదారి వద్దకు వచ్చేసరికి నొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 వాహనాన్ని రహదారి పక్కనే నిలిపి పైలట్ పాపారావు సహాయంతో ఈఎంటీ తేజబాబు డెలివరీ చేయగా ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని, తదుపరి చికిత్స నిమిత్తం మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించామని ఆమె తెలిపారు.

బాస్కెట్‌బాల్ బాలికల విజేత పశ్చిమ గోదావరి



మహిళల విజేత ఉమ్మడి పశ్చిమగోదావరి జట్టుకు కప్ అందజేస్తోన్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



పురుషుల విజేత తూర్పుగోదావరి జట్టుకు కప్ అందిస్తున్న ఎమ్మెల్యే

నూజివీడు: నూజివీడు డీఏఆర్ కళాశాలలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న 8వ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ బాస్కెట్‌బాల్ బాలుర, బాలికల పోటీలలో బాలికల విజేతగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టు నిలిచింది. బాలుర విజేతగా ఉమ్మడి తూర్పుగోదావరి జట్టు గెలుపొందింది. ఈ ఫైనల్ మ్యాచ్‌లకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హాజరయ్యారు. బాలికల సెమి ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లతో పాటు తృతీయ స్థానాలకు సంబంధించిన పోటీలను ఆదివారం నిర్వహించారు.

హోరాహోరీగా సెమీఫైనల్ మ్యాచ్‌లు

బాలుర సెమీఫైనల్ మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. ఉమ్మడి కృష్ణాజిల్లా జట్టు, వైజాగ్ జట్ల మధ్య నువ్వా నేనా రీతిలో సాగిన మ్యాచ్‌లో కృష్ణా జిల్లా జట్టు 67–61 స్కోర్‌తో వైజాగ్ జట్టుపై గెలుపొంది ఫైనల్‌కు చేరింది. మరో మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు అనంతపురంపై 63–58 తేడాతో గెలుపొంది ఫైనల్‌లోకి ప్రవేశించింది. బాలికల విభాగంలో సెమీఫైనల్స్ మ్యాచ్‌లు ఏకపక్షంగా సాగాయి. తూర్పుగోదావరి జట్టు కృష్ణా జట్టుపైనా, పశ్చిమ గోదావరి జట్టు అనంతపురంపైనా విజయం సాధించి ఫైనల్స్‌కు చేరాయి.

రసవత్తరంగా ఫైనల్ మ్యాచ్‌లు

బాలికల, బాలుర ఫైనల్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగాయి. బాలికల ఫైనల్ మ్యాచ్‌లో పశ్చిమ గోదావరి జట్టు తూర్పు గోదావరి జట్టుపై 48–35 తేడాతో గెలుపొంది విజేతగా నిలిచింది. మొదటి ప్రథమార్ధం వరకు ఇరు జట్లు హోరాహోరీగా పోరాడినప్పటికీ ఆ తరువాత నుంచి పశ్చిమగోదావరి జట్టుదే పైచేయి అయింది. బాలుర ఫైనల్స్‌లో తూర్పుగోదావరి జట్టు కృష్ణా జిల్లా జట్టుపై 80–54 తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్ ప్రారంభం నుంచి ఏకపక్షంగా సాగింది.

బాలుర విభాగంలో తూర్పుగోదావరి విజయం

బాస్కెట్‌బాల్ పోటీలకు నూజివీడులో ఆదరణ: ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

బాస్కెట్‌బాల్ పోటీలకు నూజివీడులో పూర్వకాలం నుంచి ఆదరణ లభిస్తుందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. విజేతలకు కప్‌ను, మెమొంటోలను అందజేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలలో ప్రావీణ్యత ప్రదర్శించడం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకోవచ్చన్నారు. క్రీడాకారులు కృషి, పట్టుదలతో ఆడి తమ ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉద్బోధించారు. నూజివీడులో క్రీడాభివృద్ధికి స్టేడియంల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, పట్టణ సిఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, టోర్నమెంట్ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరడుగుల తాచుపాము హల్‌చల్



తాచుపాముతో స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షుడు క్రాంతి

జంగారెడ్డిగూడెం మండలంలోని పేరంపేటలో ఆదివారం పొలంలో కూలీలు పనిచేస్తున్న ప్రాంతంలో 6 అడుగుల తాచుపాము హల్‌చల్ చేసింది. బుసలు కొట్టడంతో కూలీలు అక్కడ నుంచి పరుగులు తీశారు. కూలీలు స్నేక్ సేవియర్ సొసైటీ అధ్యక్షులు క్రాంతికి సమాచారం ఇచ్చారు. దీంతో పామును క్రాంతి సురక్షితంగా పట్టుకుని జనావాసాలు లేని ప్రాంతంలో విడిచిపెట్టారు.

–జంగారెడ్డిగూడెం రూరల్

పింఛన్ల పంపిణీలో వలంటీర్ల నిబద్ధత



కాలుకు గాయమైనా వలంటీర్‌గా సేవలందిస్తున్న బర్రే మహేష్



పాలకొల్లు వెళ్లి ఫించన్ అందజేస్తున్న తేతలి వలంటీర్



ఏలూరు ఆసుపత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్



కృష్ణాజిల్లా వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

తణుకు టౌన్: గాయంతో ఇబ్బందిపడుతున్నా తణుకు రూరల్ మండలం వేల్పూరుకు చెందిన వలంటీర్ బర్రే మహేష్ పింఛన్ల పంపిణీ కొనసాగించాడు. మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదం కారణంగా కాలు విరగ్గా.. విశ్రాంతి తీసుకుంటున్నాడు. నెల మొదటి తేదీ కావడంతో తన సహచర వలంటీర్‌ను తన పరిధిలోని పింఛన్లు పంపిణీ చేయాలని అభ్యర్థించాడు. అయితే ప్రతిసారి వేలిముద్రలు తీసుకోవడంతో లబ్ధిదారులతో సహా ప్రతిసారి తన వద్దకు రావడం ఇష్టంలేక కాలుకు గాయమైనా.. ఇంటింటికి వెళ్లి పింఛన్ సొమ్ములు పంపిణీ చేశాడు. దీంతో ఇతర పింఛన్‌దారులు అతని వద్దకే వచ్చి తమ పింఛన్ సొమ్ములు తీసుకున్నారు.

పాలకొల్లు వెళ్లి పింఛన్ అందజేత

తణుకు రూరల్: మండలంలోని తేతలికి చెందిన కోట సూర్యకాంతం గత నెలలో పాలకొల్లులోని తన కుమార్తె ఇంటికి వెళ్లింది. అక్కడ కాలుకు గాయం కావడంతో లేవలేని స్థితిలో ఉండడంతో వలంటీర్ పాలకొల్లు మండలం వెంకటాపురం వెళ్లి సూర్యకాంతంకు పింఛన్ అందించారు.

ఏలూరు వెళ్లి పింఛన్ అందజేత

ఉంగుటూరు: రాచూరుకు చెందిన కిలారి బ్రహ్మనాగేశ్వరావు ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్ధిదారుడికి పెన్షన్ అందజేశాడు. ఉయ్యాల సత్యనారాయణ వారం క్రితం యాక్సిడెంటుకు గురై ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీరు ఏలూరు వెళ్ళి పింఛన్ అందజేశాడు.

కృష్ణా జిల్లా వెళ్లి పింఛన్ అందజేత

పాలకోడేరు: మోగల్లుకు చెందిన సాగిరాజు నరసమ్మ అనారోగ్యంతో కృష్ణాజిల్లా తాడినాడలో బంధువుల ఇంటి వద్ద మంచానికే పరిమితమైంది. అలాగే రుద్రరాజు రాజేంద్ర రాజు అనారోగ్యంతో చించినాడలో బంధువుల ఇంటి దగ్గర ఉంటున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ కడిమి సురేష్ బాబు జిల్లాలు దాటి వెళ్లి నరసమ్మకు, రాజేంద్ర రాజుకు వృద్ధాప్య పింఛన్లు అందజేశాడు.

రేషన్ బియ్యం పట్టివేత



పంగిడిగూడెం శివారులో పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం వ్యాన్

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం శివారులో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యాన్‌ను ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. అనంతరం 4,230 కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై టి.సుధీర్ వివరాల ప్రకారం.. ఇరగవరం మండలం కొముదవల్లి గ్రామానికి చెందిన పాయసం నాగవరప్రసాద్, కామవరపుకోట మండలం తడికలపూడి నుంచి 4,230 కేజీల రేషన్ బియ్యాన్ని తన వ్యాన్‌లో పిఠాపురం మండలం ప్రత్తిపాడుకు తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి, వ్యాన్‌ను సీజ్‌చేసి అందులోని రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని చోడిశెట్టి మహేష్ సూచనల మేరకు, తడికలపూడికి చెందిన ఈడ్పుగంటి సందీప్ వద్ద నుంచి తీసుకెళ్తున్నట్టు గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలయంలో చోరీకి యత్నం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఆరుళ్ళ వెన్నేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. ఆలయం తలుపులు తెరుచుకోకపోవడంతో దుండగులు అక్కడ నుంచి వెనుదిరిగారు. ఆలయంలో ఎలాంటి వస్తువులు చోరీకి కాలేదు. ఆలయ ఈవో రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పంట కాలువలు కలుషితం

ఆకివీడు: మండలంలోని రాజులపేట వద్ద ఓల్డ్ వయ్యేరు పంట కాల్వలోకి రొయ్యల చెరువుల నీటిని వదులుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. గత మూడు రోజులుగా రొయ్యల చెరువులోని నీటిని అక్రమ తూర ద్వారా పంట కాల్వలోకి వదులుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వరి రైతులు ఆకుమడులు వేసుకుంటున్న సమయంలో పంట కాల్వల్లోకి ఉప్పు శాతం ఎక్కువగా ఉన్న నీటిని నింపితే విత్తనం మొలకెత్తదని, మొలకెత్తిన చిగుళ్లు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. నారు ఎదుగుదల కూడా ఉండదని, ఆకుమడులలోనే గింజలు ఎండిపోయే అవకాశం ఉందని చెబుతున్నారు. ఆకుమడుల సమయంలో రొయ్యల చెరువుల నుంచి నీటిని పంట కాల్వల్లోకి వదలకుండా నీటి పారుదల శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో భారీ నష్టం వాటిల్లుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కాల్వలోకి అక్రమంగా మురుగు నీరు వదిలే తూరల్ని తొలగించాలని గత కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య



మృతుడు నాగరాజు

ద్వారకాతిరుమల: భార్య మందలించడంతో కలుపు మందు తాగిన ఒక వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. దీనిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై టి.సుధీర్ తెలిపిన వివరాల ప్రకారం.. గుణ్ణంపల్లి మండలం తక్కెళ్లపాడుకు చెందిన బొప్పన నాగరాజు(40) గత నెల 28న రాత్రి మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. దాంతో అతని భార్య మంగ ఎందుకు మద్యం తాగుతున్నావని మందలించింది. దాంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన నాగరాజు ఇంటి వద్ద ఉన్న కలుపు మందు తాగాడు. ఇది చూసిన అతని కుమార్తె నాగరాజును భీమడోలులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతున్న నాగరాజు పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

పెంటపాడు: మండలంలోని మౌంజీపాడులో ఆదివారం సాయంత్రం పెంటపాడు పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేశారు. పెంటపాడు ఎస్సై జి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో ఊరి చివర పేకాడుతున్న సమాచారం అందుకొన్న ఎస్సై జి.సత్యనారాయణ తన సిబ్బందితో ఆకస్మిక దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.18,840 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

భీమవరం మండలంలో 9 మంది అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఎస్సై బి.మోహన్‌రావు తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేసి 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. దిరుసుమర్రులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం తెలుసుకుని సిబ్బందితో దాడి చేసి రూ.6,100 నగదు స్వాధీనం చేసుకున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు



ప్రమాదంలో కారుపై విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

ద్వారకాతిరుమల: శ్రీవారి దర్శనానంతరం మద్ది క్షేత్రానికి వెళ్తున్న ఒక భక్తుడి కారు స్థానిక కోతమిషన్ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసం కాగా, భక్తుడి కుటుంబం సురక్షితంగా బయటపడింది. స్థానికుల కథనం ప్రకారం.. కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, బొమ్ములూరుకు చెందిన భక్తుడు లక్ష్మణరావు కుటుంబ సభ్యులతో కలిసి తన కారులో ఉదయం ద్వారకాతిరుమల క్షేత్రానికి విచ్చేశాడు. స్వామివారి దర్శనానంతరం మద్ది ఆంజనేయ స్వామిని దర్శించేందుకు వెళుతున్నారు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన బైక్‌ను తప్పించే క్రమంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని వేగంగా ఢీకొట్టింది. దాంతో విద్యుత్ స్తంభం విరిగి కారుపై పడింది. ఈ ప్రమాదంలో భక్తుడు లక్ష్మణరావు కుటుంబం సురక్షితంగా బయటపడగా, కారు ధ్వంసమైంది.

● గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

మృతదేహం ఆచూకీ లభ్యం

తణుకు: తణుకు రైల్వే అవుట్ పోలీసు స్టేషన్ పరిధిలో రైలు పట్టాలపై మృతిచెందిన గుర్తు తెలియని మహిళ ఆచూకీని రైల్వే పోలీసులు గుర్తించారు. తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన చిందాడ దమయంతి(66) మతిస్థిమితం లేకపోవడంతో ఈనెల 20న ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలిస్తుండగా ఆరవల్లి రైల్వేస్టేషన్ సమీపంలో మృతదేహం లభ్యమైనట్లు సమాచారం అందింది. తణుకు నుంచి బంధువుల ఇంటికి వెళ్లే క్రమంలో రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. భర్త పాపారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

బాలికలతో టీడీపీ కార్యకర్త అసభ్య ప్రవర్తన

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ దృష్టికి తీసుకెళ్లిన విద్యార్థినులు



ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు దృష్టికి తీసుకెళ్తున్న బాలికలు

నూజివీడు: కాలేజీ నుంచి ఇంటికి వస్తుండగా కాలేజీ బస్సు ఎక్కి తమ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు దుర్భాషలాడిన ఏలూరు జిల్లా ముసునూరు మండలం గోపవరానికి చెందిన తెలుగుదేశం పార్టీకి చెందిన వడ్లపట్ల మురళి (45)పై చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు ఆదివారం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును కోరారు. ముసునూరు మండలం గోపవరం తదితర ప్రాంతాలకు చెందిన విద్యార్థినులు ఏలూరులోని శ్రీ చైతన్య కళాశాలలో చదువుతున్నారు. గత నెల 30న విద్యార్థినులు కాలేజీ బస్సులో ఇంటికి వెళ్తుండగా రాత్రి 7.30 గంటల ప్రాంతంలో టీడీపీకి చెందిన వడ్లపట్ల మురళి బలవంతంగా కాలేజీ బస్సులోకి ఎక్కాడు. అతను బస్సులో ఉన్న ఆడపిల్లలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ దుర్భాషలాడాడు. దీంతో విద్యార్థినులు తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పారు. కాలేజీ బస్సు ఆగే ప్రాంతం వద్దకు వారందరూ వచ్చారు. గోపవరంలో బస్సు ఆగిన తరువాత తల్లిదండ్రులు నిలదీస్తుండగా వారిని నెట్టివేయడంతో మోతినేని రాంబాబు అనే అతనికి దెబ్బలు తగిలి గాయపడ్డాడు. బస్సు వద్దకు పోలీసులు రావడంతో బాలికలు ఫిర్యాదు చేశారు. తాము ఫిర్యాదు చేసి రెండు రోజులవుతున్నా ఇంతవరకు మురళిపై పోలీసులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, అతను గతంలో హత్య కేసులో నిందితుడని, తమకు భయంగా ఉందని విద్యార్థినులు ఎమ్మెల్యే ప్రతాప్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే వెంటనే రూరల్ సీఐ ఆర్.అంకబాబుకు ఫోన్ చేసి నిందితుడిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థినులతో పాటు సర్పంచి కంచర్ల వాణి, వైస్ ఎంపీపీ పాముల గంగాధరరావు, వైఎస్సార్‌సీపీ ముసునూరు మండల అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు ఉన్నారు. మురళి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడాన్ని వైఎస్సార్‌సీపీ ముసునూరు మండల అధ్యక్షుడు మూల్పూరి నాని తీవ్రంగా ఖండించారు.

ఆలోచింపజేసిన నాటికలు



నిశ్శబ్దమా నీ ఖరీదెంత? నాటికలో దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన హేలాపురి కళా పరిషత్, హిందూ యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న అల్లూరి సీతారామరాజు స్మారక ఆహ్వాన నాటిక పోటీల్లో ఆదివారం రెండో రోజు ప్రదర్శించిన నాటికలు ఆలోచింపచేశాయి. తొలుత వల్లూరి శివప్రసాద్ రచించిన వెండి అంచులు నాటికను గంగోత్రి సాయి దర్శకత్వంలో అద్భుతంగా ప్రదర్శించారు. సుఖం కోసం మాత్రమే స్త్రీని వాడుకునే కాముకుడి మీద తిరుగుబాటు చేయలేని నిస్సహాయ స్థితిలో స్త్రీ ఎంత కాలం అణగారి ఉంటుందనే అంశంపై నాటిక ఆద్యంతమూ ఆకట్టుకుంది. అనంతరం పీటీ మాధవ్ రచించిన నిశ్శబ్దమా నీ ఖరీదెంత? నాటిక చలసాని కృష్ణ ప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించారు. అక్రమ సంబంధం నేరం కాదనే నేపథ్యంలో నైతిక విలువల మాటేమిటి? వివాహ వ్యవస్థ పవిత్రత మాటేమిటి? ఈ సమాజం ఎటు పోతుంది? వంటి అంశాలతో నాటికను రక్తి కట్టించారు. మూడవ ప్రదర్శనగా కాపలా నాటికను ప్రదర్శించారు. ప్రపంచం ఇవాళ రకరకాల కాపలాల ప్రహరీలో జీవిస్తోంది. దేనికై తే కాపలా పెట్టుకోవాలో దాన్ని వదిలేసి.. మిగతా వాటికి ఎన్ని కాపలాలు పెట్టినా ఫలితం శూన్యం అంటూ సందేశాత్మకంగా కాపలా నాటిక ప్రదర్శన సాగింది. ఈ కార్యక్రమంలో హిందూ యువజన సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, హేలాపురి కళాపరిషత్ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ, గుత్తా కొనలేంద్ర రావు, సంకు సురేష్, ఎండీ ఖాజా వలి, వైఎంహెచ్ఏ సభ్యులు లంక వెంకటేశ్వర్లు, ఎం.సూర్యనారాయణ యాదవ్, గరికపాటి కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపముఖ్యమంత్రి కొట్టుకు సత్కారం



కొట్టు సత్యనారాయణను సత్కరిస్తున్న జగ్జీవన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియామక ఉత్తర్వులు అందుకున్న పట్టణానికి చెందిన తెన్నేటి జగ్జీవన్ ఆదివారం ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను ఆయన నివాసం వద్ద కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా జగ్జీవన్ ఉప ముఖ్యమంత్రిని సత్కరించారు. జగ్జీవన్‌కు ఉపముఖ్యమంత్రి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, ద్వారకా తిరుమల ట్రస్ట్ బోర్డు సభ్యులు ముప్పిడి సంపత్ కుమార్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొవ్వూరి అప్పిరెడ్డి, వైసీపీ నాయకులు నలిమిల్లి విజయా రెడ్డి, కొల్లి రాజశేఖర్, న్యాయవాది జాలపర్తి సురేష్ బాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు గణపతిరావు మృతికి సంతాపం

తాడేపల్లిగూడెం (టీఓసీ): యూటీఎఫ్ నాయకుడు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత ఎంఈఓ, పట్టణానికి చెందిన ఆళ్ళ గణపతిరావు మృతి పట్ల ఆదివారం టీచర్స్ కాలనీలో జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ప్రత్తి వీరాస్వామి నివాసం వద్ద నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. ఎం.రామకృష్ణ, కె.ఏసురత్నం, అద్దేపల్లి కృష్ణశాస్త్రి, సీహెచ్ రవికుమార్, కె.నూకరాజు, పి.తిరుపతిరావు, ఎంవీ భాస్కరరావు, ఎస్‌కే వెంకన్న సాహెబ్ మాట్లాడుతూ గణపతిరావు మరణం తీరని లోటని అన్నారు. ఆయన సైన్సు, ఇంగ్లీషు బోధన ద్వారా ఎంతో మంది విద్యార్థులకు శాస్త్రీయ అంశాలపై అవగాహన కల్పించడంలో ఎనలేని కృషి చేశారని కొనియాడారు.

జనతా ట్రస్ట్ కార్యాలయంలో 121 మందికి వైద్య పరీక్షలు



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం అధ్యక్షుడు వంగపండు రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో పి.చంద్రశేఖర శ్రీనివాసరావు (చందు) ఆర్థిక సహకారంతో ఆదివారం కడకట్ల జనతా ట్రస్ట్ కార్యాలయంలో 121 మందికి వైద్య పరీక్షలు చేశారు. క్లబ్ జోన్ చైర్మన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. హాజరైన ప్రజలకు రక్తపరీక్షలు నిర్వహించి డయాబెటిస్‌పై అవగాహన కల్పించారు. క్లబ్ సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, ఆంజనేయస్వామి పాల్గొన్నారు.

జీపీఏటీ ర్యాంకర్ తనూజకు అభినందన



ర్యాంకర్ తనూజ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఫార్మసీ విభాగం మూడో సంవత్సరం విద్యార్థి కె.తనూజ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఫార్మసీ అప్టిట్యూడ్ టెస్ట్ (జీపీఏటీ) జాతీయ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంక్ 3,522తో అర్హత పొంది 94.32 స్కోర్‌ను సాధించారు. ప్రొఫెసర్ పద్మరాజు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.రమేష్, ఫార్మసీ కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ హీరా బట్టు, అధ్యాపకులు నిత్యానంద్ రెడ్డి, ఎస్.లిఖిత, పి.అరుణ, విద్యార్థులు ర్యాంకర్ తనూజకు అభినందనలు తెలిపారు.

పీఎంపీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

తాడేపల్లిగూడెం (టీఓసీ): కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల యూనిట్లు నూతన కార్యవర్గం ఎన్నిక తాళ్ళ ముదునూరుపాడులో పీఎంపీ భవనంలో నిర్వహించారు. అసోసియేషన్ నిర్వాహకులు ఆదివారం ఎన్నిక వివరాలను వెల్లడించారు. గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, గౌరవ సలహాదారులు వై.గోపాలకృష్ణ, అధ్యక్షులు మునగాల జితేంద్ర, ఉపాధ్యక్షుడు జీవీ త్రినాథ్, కార్యదర్శి కొల్లి రాజశేఖర్, సహాయ కార్యదర్శి గుర్రాల దుర్గారావు, కోశాధికారి కొడిసి రమేష్, సభ్యులు రామచంద్రుడు, ఎస్‌కేఎం జాన్, లోవరాజు, శ్రీనివాస్, వెంకటేష్, సింహాచలం, గిరిధర్ సింగ్ అజీజ్ ఎన్నికయ్యారు. జిల్లా కన్వీనర్ పరమేశ్వర్లు, ఏపీ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు, టీవీ రమణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మెండుగా ప్రజల మద్దతు

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- కొమ్ముగూడెం, వెంకట్రామన్నగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతిపక్షాలు ఎన్ని కుతంత్రాలు పన్నినా ప్రజల మద్దతు వైఎస్సార్ సీపీకి మెండుగా ఉందని, వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గద్దెనెక్కించేందుకు జనం సిద్ధంగా ఉన్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెం, వెంకట్రామన్నగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నుంచి వెంకట్రామన్నగూడెం వరకు నాలుగు లైన్ల రోడ్డుకు రూ.26 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. మరో రూ.15 కోట్లు అదనంగా మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను వాటి ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని ఆయన వివరించారు. లబ్ధిదారులకు పథకాల వివరాలో కూడిన బ్రోచర్‌లు అందజేశారు. అనంతరం



కొమ్ముగూడెంలో ప్రజలకు పథకాలను వివరిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

వారి సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సూర్పని రామకృష్ణ, ఎంపీటీసీ మార్లపూడి సుబ్బారావు, సర్పంచ్ పోలిమోను నాగఅంజూష, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, చిక్కాల సత్యనారాయణ, ఉప సర్పంచ్ మేణ్ణి రామారావు, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, పీఆర్ డీఈ వేణుగోపాల్, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, డీడీవో రవిచంద్ర, కార్యదర్శులు ఫణికుమార్, పి.పవన్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వరరావు, దిశా ప్రొటెక్షన్ రాష్ట్ర కోశాధికారి కొల్లా విజయలక్ష్మికుమారి, మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధా కుమారి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి పెద్దబ్బులురెడ్డి, నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, చిగురుపాటి పార్వతి, పోలిమోను శ్రీనివాస్, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన

తాడేపల్లిగూడెం రూరల్: పెంటపాడు మండలం రావిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం ఉదయం 11 గంటలకు జగనన్న అమ్మ ఒడి మండల స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటలకు తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలో రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పాల్గొంటారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని క్యాంపు కార్యాలయ ప్రతినిధులు కోరారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి పరామర్శ

కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కోరాపు ఏసు (25) రోడ్డు ప్రమాదంలో చేయి కోల్పోయాడు. బాధితుడిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించి, సీఎంఆర్ఎఫ్, ఇల్లు మంజూరుకు సిఫారసు చేశారు.

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం



పేద కుటుంబాలకు సాయం అందజేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వాసవి క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలో 40 మంది రైతులకు రూ.5,700 విలువైన వ్యవసాయ పనిముట్లు స్ప్రేలు, పెస్టిసైడ్స్ అందజేశారు. పేద కుటుంబాలకు రూ.10 వేలు విలువైన బియ్యం బస్తాలు, నిత్యావసర సరుకులు అందజేశారు. పేద మహిళలకు రూ.3 వేలు చీరలు పంచారు. వాసవి ఆడిటోరియం ఎదురుగా పార్కులో రూ.13 వేలు విలువైన రెండు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. వాసవి క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. విద్యార్థులకు రూ.2,100 విలువైన పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఆర్యవైశ్యులు, దాతలు మండ బ్రహ్మాజీ, కె.రాము, కె.నాగ సురేష్, భోగవల్లి రమేష్, పులవర్తి పవన్, రాంపండు, కె.శ్యామ్, యలమర్తి జయబాబు, కె.హనుమాన్ ప్రసాద్, ఎన్.సూర్యనారాయణ మూర్తి ఈ సేవా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కార్మిక కుటుంబాల విద్యార్థులకు పురస్కారాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక కుటుంబాలకు చెందిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు పురస్కారాలు అందజేయడం హర్షణీయమని పట్టణ సీఐ వి.నాగరాజు అన్నారు. ఏరియా తాపీ, వడ్రంగి, సెంటరింగ్, రాడ్ బెండింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం భవన నిర్మాణ కార్మిక కుటుంబాల నుంచి పదో తరగతి పాసైన 26 మంది విద్యార్థులకు ప్రోత్సాహక పురస్కారాలు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు నగదు ప్రోత్సాహకం అందజేశారు. 19 మంది పిల్లలకు స్కూల్ బ్యాగ్, నిఘంటువు, నోట్ పుస్తకాలు ఇచ్చారు. యూనియన్ అధ్యక్షుడు పడాల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సీఐ నాగరాజు మాట్లాడుతూ యూనియన్ ఆధ్వర్యంలో కార్మిక హక్కులు, సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న సీఐ నాగరాజు

చేయడంతో పాటు కార్మిక పిల్లల చదువులపై దృష్టి సారించడం అభినందనీయం అన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ బి.రాజు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్, ఓసూరి వీర్రాజు, తాడికొండ శ్రీనివాసరావు, కళింగ లక్ష్మణరావు, అంకం భాస్కరరావు, పోలిరాతి ఆదినారాయణ, దువ్వా శ్రీనివాస్, రాజా వెంకట్రావు, సైకాలజిస్ట్ గంగాధర్ మాట్లాడారు. యూనియన్ నాయకులు, కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవినీతి ధనంతో అందలమెక్కేందుకు బాబు అండ్ కో ప్రయత్నం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఓటమి అనంతరం పత్తా లేకుండా పోయిన బాబు అండ్ కో నేడు ఎన్నికలు సమీపిస్తుండటంతో అవినీతి ధనంతో అందలమెక్కేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు విమర్శించారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. 14 ఏళ్ల అధికారంలో ఉన్న బాబు పేదలకు చేసిన మేలు ఒక్కటైనా ఉందేమో చెప్పి ఎన్నికలకు రావాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్, లోకేశ్ యాత్రలు జోకర్ షోలను తలపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. బాబును గెలిపించేందుకు వారు యాత్ర చేస్తున్నారని విమర్శించారు. బహుజనుల జపం చేస్తున్న పచ్చ పార్టీలను మట్టి



మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

కరిపించడం ఖాయం అన్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో సమ ప్రాధాన్యత

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నారనేందుకు రాష్ట్రంలో పేదలకు 35 లక్షలు ఇళ్ల స్థలాలు ఇచ్చి అందులో పక్కా ఇళ్లు నిర్మించడమే నిదర్శనమని కొనియాడారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెలలో కొలువై ఉన్నారన్నారు. రానున్న ఎన్నికలలో తిరిగి ఏపీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్ రెడ్డి విజయం సాధించడం ఖాయమని వివరించారు.

అమరావతిలో 50 వేల మందికి ఇళ్ల స్థలాలు అభినందనీయం

అమరావతి ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం 50 వేల మందికి ఇళ్ల స్థలాలు కేటాయించడం అభినందనీయమని మంగరాజు హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో కేంద్రం 47 వేలు ఇల్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని, మరో 3 వేలు ఇళ్లకు నిధులు మంజూరు చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

మత మార్పిడులను ప్రోత్సహిస్తే సహించం

యలమంచిలి: పరమత సహనం మన దేశ విధానమని, ఆ పేరు చెప్పి అన్య మతస్తులు హిందువుల వద్దకు వెళ్లి మతం మారమని ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోమని విశ్వ హిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు పెరికిపాలెం శ్రీనివాస్, శిరంగు నాయుడు హెచ్చరించారు. దొడ్డిపట్ల గ్రామంలోని విజయసారథి కాలనీలో ఆదివారం జరిగిన హిందూ చైతన్య సమ్మేళన సభలో వారిరువురు మాట్లాడుతూ హిందువుల్లో ఉన్న అహింసా సిద్ధాంతాన్ని అలుసుగా తీసుకుని అన్య మతస్తులు మత మార్పిడులను ప్రోత్సహిస్తూ గ్రామాలలో ర్యాలీలు, ప్రచారాలు చేయడం సమంజసం కాదన్నారు. సమావేశంలో భజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడు ముత్యాల చంటి నాయకులు దివి ప్రకాష్,



హిందూ చైతన్య సమ్మేళన సభలో మాట్లాడుతున్న పెరికిపాలెం శ్రీనివాస్

గుబ్బల బాబ్జీ, ముత్యాల నాగ బాలాజీ, పిల్లి మాధవ బీజేపీ నాయకులు వీరాజీ, నామన శ్రీనివాస్, కారిచర్ల పతంజలి, లక్కోజు శేషు, కామాడి శ్రీను, శేరు నాగబాబు, గుడాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు రావిపాడులో అమ్మఒడి కార్యక్రమం

పెంటపాడు: పెంటపాడు మండలంలోని రావిపాడులో సోమవారం అమ్మఒడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 10 గంటలకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా ఆయన ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సమావేశాన్ని విద్యార్థుల తల్లులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

25 వరకు జగనన్న సురక్ష

అత్తిలి: మండలంలో ఈనెల 25 వరకు జగనన్న సురక్ష సభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ వీవీవీఎస్ రామారావు చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 4న అత్తిలి-1, మంచిలి, 6న ఆరవల్లి, అత్తిలి-2 గ్రామ సచివాలయం, 11న అత్తిలి-3, పాలి గ్రామసచివాలయంలో, 13న అత్తిలి-4, ఉనికిలి, 15న లక్ష్మీనారాయణపురం, ఉరదాళ్లపాలెం, 18న బల్లిపాడు, స్కిన్నెరపురం, 20న కంచుమర్రు, తిరుపతిపురం, 22న గుమ్మంపాడు, పాలూరు. 25న కొమ్మర , వరిఘేడు గ్రామాలలో జగనన్న సురక్ష సభలు నిర్వహిస్తామని వివరించారు. జరుగుతాయని తెలిపారు. ప్రతీ గ్రామానికి మండలస్థాయి అధికారుల బృందం హాజరై లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తారని వివరించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య సంపద

యలమంచిలి: రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేసి ఆరోగ్య సంపద పెంచుకోవాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి కోరారు. కాంబొట్లపాలెంలో ఆదివారం ఆమె డ్వాక్రా మహిళలతో సమావేశమై ప్రకృతి వ్యవసాయంలో మెళకువలు వివరించారు. ఈ సందర్భంగా పంటలను చీడపీడల నుంచి రక్షించుకోవడానికి రసాయనిక ఎరువుల వైపు వెళ్లకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కోడిగుడ్డు, నిమ్మకాయ ద్రావణంతో ఎలా రక్షించవచ్చు? అనే విషయంపై అవగాహన కల్పించారు. అనంతరం కోడిగుడ్డు, నిమ్మకాయ రసం తయారీ విధానం వివరించారు. మహిళలంతా తమ పెరటిలో ప్రకృతి వ్యవసాయ విధానంలో కాయకూరలు, ఆకు కూరలు సాగు చేసి ఆరోగ్యాన్ని రక్షించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలతో కాయకూరలు, ఆకు కూరల



కాంబొట్లపాలెంలో కూరగాయల విత్తనాలను ప్యాకింగ్ చేస్తున్న డ్వాక్రా మహిళలు

విత్తనాలు ప్యాకింగ్ చేయించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి జ్యోతి, ఐసీఆర్‌పీలు జడ్డు లక్ష్మీనారాయణ, కె సోని, బి లక్ష్మీదుర్గ డ్వాక్రా యానిమేటర్ కుక్కల వరలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీసీలకు ప్రాధాన్యత

పోడూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో బీసీ కులాలన్నింటికీ ప్రాధాన్యత కల్పిస్తున్నారని జాతీయ బీసీ మహాసభ పాలకొల్లు నియోజకవర్గ కన్వీనర్ చింతపల్లి రాధాకృష్ణ అన్నారు. జిన్నూరులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రత్యేక కార్పొరేషన్‌ల ఏర్పాటు ద్వారా అన్ని బీసీ కులాలకు న్యాయం చేస్తున్నారన్నారు. మంత్రివర్గంలోనూ, నామినేటెడ్ పదవుల్లోనూ బీసీలకు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రాముఖ్యత కల్పించారన్నారు. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగేళ్లలో అందించిన మంచి పరిపాలనతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని బీసీ కులాలకు చెందిన పేద, సామాన్య కుటుంబాలు



చింతపల్లి రాధాకృష్ణ

విద్యాపరంగా, వ్యాపారపరంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడం చూస్తున్నామన్నారు. సచివాలయ, వలంటరీ వ్యవస్థ, ఇంటింటికీ రేషన్ ఏర్పాటుతో లక్షలాది మంది బీసీ యువత ఉద్యోగాలు, ఉపాధి పొందిందన్నారు. అన్ని బీసీ కులాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంతో పాటు వారి సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేయడమే జాతీయ బీసీ మహాసభ లక్ష్యమన్నారు. రాబోయే కాలంలో పాలకొల్లు నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ కమిటీలు ఏర్పాటు చేసి గ్రామస్థాయిలో బీసీ కులాల ప్రజలను చైతన్యం చేస్తామని రాధాకృష్ణ తెలిపారు.

సంచార వైద్యశాలలో 12మంది వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతీ ఆదివారం నిర్వహించే సంచార వైద్యశాల ద్వారా 12 మందికి ఉచిత వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. ఆదివారం సంచార వైద్య శాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ సంచార వైద్యశాల ద్వారా తణుకు పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఇంటి నుంచి నడవలేని 12 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సంఘ సభ్యులు నల్లజర్ల వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి బాస్కరరావు, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సిల్టు తొలగింపు పనులు

పోడూరు: జిన్నూరు గ్రామంలో గత 2 రోజులుగా గ్రామంలోని డ్రెయినేజీల్లో సిల్టు తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పనులను ఆదివారం సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి వి.రాంబాబు, ఉప సర్పంచ్ దండు గోపాలం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహాలక్ష్మి మాట్లాడుతూ వర్షాకాలం సమీపించడంతో గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీల్లో సిల్టు తొలగింపు పనులు చేపట్టినట్లు చెప్పారు. పారిశుద్ధ్య కార్మికుల కొరత కారణంగా తణుకు నుంచి ప్రత్యేకంగా కార్మికులను రప్పించి పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్ఆర్‌పేట, భూపయ్యచెరువు, మెయిన్ విలేజ్, కొత్తపేట, సూర్యాకాలనీ, రమణ నగర్, నర్సరాజునగర్, జిన్నూరుపాలెం తదితర ప్రాం



సిల్టు తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న పంచాయతీ కార్యదర్శి వి.రాంబాబు

తాల్లో సిల్టు తొలగింపు పనులు పూర్తి చేస్తామన్నారు. అలాగే డ్రెయినేజీలు లేని చోట కచాఛ్ డ్రెయిన్‌లు తవ్వుతున్నట్లు చెప్పారు.

సమాజహితం కోసమే లయన్స్ సేవలు

నరసాపురం రూరల్: సమాజహితం కోసం లయన్స్‌క్లబ్ అందిస్తున్న సేవలు ఎనలేనివని శాసన మండలి సభ్యులు, ఆంధ్రప్రదేశ్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ వంక రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం నరసాపురం జై రాజేంద్ర లయన్స్ సర్వీస్ సెంటర్‌లో నిర్వహించిన నరసాపురం లయన్స్‌క్లబ్, నరసాపురం ఫెమినా లయన్స్ క్లబ్‌ల నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవా సంస్థలు సమాజహితం కోసం నిరంతరం పనిచేయడం ఎంతో గౌరవమైన విషయమన్నారు. లయన్స్ క్లబ్‌లోని సభ్యులంతా ఎంతో ఉన్నతమైన సేవా భావం కలిగిన వారని కొనియాడారు. నరసాపురంలోని లయన్స్ ఆడిటోరియం అనేక సేవలకు స్థావరంగా ఉందన్నారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు కూడా క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి పేదలకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. నరసాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పులపర్తి ప్రతాప్, కార్యదర్శిగా కె.బాలాకుమారి, ట్రెజరర్‌గా రంగినీడి భరణిలతో పాటు పలువురు క్లబ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. పలువురు పేదలకు నిత్యావసర సరుకుల కిట్‌లను అందించారు. కళ్యాణి మానసిక వికలాంగ పాఠశాలకు రూ.5వేల నగదును పాస్ట్ ప్రెసిడెంట్ రాజేంద్ర ప్రసాద్ అందించారు. కార్యక్రమంలో డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, మేకా శ్రీరామ్‌సురేష్, పాపారావునాయుడు, కేబీ ఫణీంద్రుడు, రోజారమణి పాల్గొన్నారు.

ముగియనున్న మామిడి సీజన్

నరసాపురం రూరల్: నరసాపురం ప్రాంత మామిడికి రాష్ట్రంలోనే కాక దేశ విదేశాల్లో కూడా మంచి పేరుంది. అయితే ఈ ప్రాంత మామిడి సీజన్ ఆఖరులో దిగుబడి వస్తుంటుంది. ఈ ఏడాది పూత దశలో వర్షాలు విరివిగా పడటంతో మంగు, పుచ్చు తెగుళ్ల విపరీతంగా సోకడంతో వచ్చిన కొద్ది దిగుబడి కూడా చేతికందే పరిస్థితి లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. మరో వారం రోజుల్లో పూర్తిగా సీజన్ ముగిసే పరిస్థితి ఉంది. అయితే ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉన్నప్పటికీ దిగుబడి లేకపోవడంతో రైతులు నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. మామిడికి తెగుళ్లు సోకడం సహజమే అయినప్పటికీ తెగుళ్లకు పిచికారీ చేసే మందులు వినియోగించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. తెగుళ్లకు తోడు విపరీతమైన ఎండ వేడిమికి కాయలు నేలరాలడం తదితర కారణాలతో మామిడి రైతు నష్టాల ఊబిలో కూరుకుపోవాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఏదేమైనప్పటికీ సీజన్ ముగుస్తుండడంతో మళ్లీ వచ్చే మామిడి సీజన్ బాగుండాలని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



శిరగాలపల్లిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ, పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. శిరగాలపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోను లేని విధంగా మన రాష్ట్రంలో మాత్రమే పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఏదైనా సాంకేతిక సమస్య వల్ల అర్హులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందకపోతే ఆ సమస్యలు తొలగించి అర్హులకు న్యాయం చేసేందుకే జగనన్న సురక్ష సభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎంపీపీ రావూరి వెంకటరమణ, సర్పంచ్ చిలుకూరి సుబ్బారావు చౌదరి పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు వీరవల్లి నరసింహమూర్తి సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు సర్పంచ్‌ల చాంబర్ మండల అధ్యక్షుడు వల్లభు సాయి వెంకట నరసింహారావు పార్టీ నాయకులు పైడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని డిమాండ్

సాక్షి, భీమవరం: జిల్లాలో సాగునీరు విడుదల చేసి నెల రోజులైనా పూర్తి స్థాయిలో నీరందక నేటికి నారుమడులు వేసే పరిస్థితి లేదని కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వం ముందస్తు సాగు అంటూ గతనెల ఒకటవ తేదీన సాగునీరు విడుదల చేసిందన్నారు. పంటకాలువలు ఆధునీకీకరణ చేయకపోవటంతో పూర్తి స్థాయిలో ప్రవాహం లేక జిల్లాలో అనేక ప్రాంతాల్లో నారుమడులు వేయలేదన్నారు. తీరప్రాంత మండలాలైన యలమంచిలి, పాలకొల్లు, నరసాపురం, మొగల్తూరు, భీమవరం వంటి మండలాల్లో ఏళ్లతరబడి మురుగు కాలువలు తవ్వకపోవడంతో కొద్దిపాటి వర్షం వచ్చినా పంటలు మనిగి పోతున్నాయనే ఆందోళనతో నేటికి నారుమళ్లు వేయలేదన్నారు. తక్షణమే సాగునీరు పూర్తిగా విడుదల చేసి మురుగు కాలువలను తవ్వాలని డిమాండ్ చేశారు.

కూరగాయల ధరలకు రెక్కలు

ఆకివీడు: ఓ వైపు వర్షాభావ పరిస్థితులు, మరో వైపు పంట కాల్వల్లో నీరు అంతంత మాత్రంగానే ఉండటంతో ఈ ప్రభావం కూరగాయల పంటలపై చూపుతోంది. దిగుబడి, ఉత్పత్తి తగ్గడంతో మార్కెట్‌లో కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. రైతు వద్ద సాధారణ ధరలకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నప్పటికీ వాటిని రెండింతల ధరకు వ్యాపారులు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. పచ్చిమిర్చి ధర కిలో రూ.160 చేరుకుంటే, టమాటా ధర కిలో రూ.100 నుంచి రూ.120, వంకాయలు కిలో రూ.100, దొండ, బెండ కిలో రూ. 80కి విక్రయిస్తున్నారు.